క్లుప్తంగా

పట్టాభిరాముడికి పుష్పాభిషేకం



స్వామి, అమ్మవార్లకు పుష్పాభిషేకం

కడప కల్చరల్ : ఉగాది వసంత నవరాత్రి వేడుకల్లో భాగంగా చివరిరోజు శుక్రవారం పట్టాభిరాముడికి వైభవంగా పుష్పాభిషేకం నిర్వహించారు. కడప హౌసింగ్‌బోర్డు కాలనీలోని కోదండ రామాలయంలో వేదికను అలంకరించారు. ఆలయ ధర్మకర్త డి.వెంకటరెడ్డి ఆధ్వర్యంలో సీతాలక్ష్మణ సమేత పట్టాభి రాముడికి వేద పండితుల మంత్రోచ్చారణ, మహిళా భక్తుల భక్తిగీతాలాపన మధ్య గురువారం పుష్పాభిషేకం నిర్వహించారు. అనంతరం సింహాసనంపై నవనవోన్మేషంగా కొలువుదీర్చిన దేవతా మూర్తులకు భక్తులు అడుగడుగునా జేజేలు పలికారు.

మహిళలకు శిక్షణ

కడప వైఎస్ఆర్ సర్కిల్ : మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఏపీజీబీ రిటైర్డ్ బ్యాంకు మేనేజర్ నారాయణరెడ్డి పేర్కొన్నారు. నగరంలోని సంజీవ రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం టైలరింగ్ శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా నారాయణరెడ్డి మాట్లాడుతూ శిక్షణ సద్వినియోగం చేసుకొని మహిళలు ఆర్థికంగా ఎదగాలని, ముద్ర రుణాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

ఎంబీఏ, ఎంసీఏ విభాగాల తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న వీసీ, ప్రిన్సిపల్

వైవీయూ : యోగి వేమన విశ్వవిద్యాలయంలోని ఎంబీఏ, ఎంసీఏ విభాగాలను వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల సమస్యలపై ఆరా తీశారు. విద్యార్థులకు ఎలాంటి సమస్యలున్నా సంబంధిత అధ్యాపకుల దృష్టికి తీసుకు రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి, ఎంసీఏ విభాగాధిపతి డాక్టర్, రెడ్డయ్య, అమృతప్రసాద్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాల బాలికల ప్రతిభ



ప్రిన్సిపల్‌తో కలిసి విజయకేతనం చూపుతున్న దుర్గాదేవి, తహేరా పర్వీన్

కడప ఎడ్యుకేషన్ : కడప ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులు ఇంటర్మీడియట్‌లో ప్రతిభ చూపారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినులను ప్రిన్సిపల్ సూర్యారావు, అధ్యాపకులు శుక్రవారం అభినందించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ లక్షల రూపాయలు ఖర్చు చేసి కార్పొరేట్ కళాశాలల్లో చదివిన విద్యార్థులకు సమానంగా తమ విద్యార్థులు మార్కులు సాధించడం అభినందనీయం అన్నారు. సీఈసీ విభాగంలో దుర్గాదేవి 1000 మార్కులకు 969 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో మూడో ర్యాంకు, బైపీసీ విభాగంలో తాహేరా పర్వీన్ 1000 మార్కులకు 975 మార్కులతో నాలుగో ర్యాంకు సాధించారన్నారు.

వృద్ధులకు పండ్లు పంపిణీ



పండ్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న అవోపా మహిళా విభాగ్ ప్రతినిధులు

కడప కల్చరల్ : వృద్ధులకు అన్ని విధాలా తోడ్పాటు అందించాలని అవోపా మహిళా విభాగం అధ్యక్షురాలు చప్పరపు నాగ పుష్పాంజలి, కార్యదర్శి దశమందం వెంకట సుప్రియలు తెలిపారు. కడప అవోపా మహిళా విభాగం ప్రతినిధులు శుక్రవారం నగర పరిధిలోని చౌడమ్మ వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవిష్యత్తులో తమ సేవా కార్యక్రమాన్ని మరింత పెద్ద ఎత్తున నిర్వహించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మధులత, రెడ్డిలక్ష్మి, ప్రశాంతి, సునీత, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎన్నికల ప్రచారం

వల్లూరు : మండలంలోని లేబాక గ్రామ పంచాయతీ పరిధిలోని చిన్ననాగిరెడ్డిపల్లె, రాగిమాకులపల్లె, పెద్ద లేబాక, చిన్న లేబాక, బక్కిరెడ్డిపల్లె గ్రామాల్లో శనివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి వైఎస్ఆర్‌సీపీ ఎన్నికల ప్రచారం జరుగుతుందని ఆ పార్టీ మండల కన్వీనర్ అబ్బిరెడ్డి వీరారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

జోరుగా వైఎస్సార్‌సీపీ ప్రచారం



సరోజినీ నగర్‌లో ప్రచారం చేస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా



15వ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు కె.సురేష్ బాబు

కడప కార్పొరేషన్ : నామినేషన్ల పర్వం మొదలవడంతో ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. వైఎస్సార్‌సీపీ కడప నియోజకవర్గ అభ్యర్థి, ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాష, ఎంపీ అవినాష్‌రెడ్డికి మద్దతుగా ఆ పార్టీ అధ్యక్షుడు కె.సురేష్ బాబు శుక్రవారం వేర్వేరుగా ప్రచారం నిర్వహించారు.

ప్రజా పాలనకు ఓటేయండి

ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా పాలన చూసి ఓటేయాలని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం 15వ డివిజన్ సరోజినీ నగర్‌లో ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అంజద్‌బాషా మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ ప్రవేశపెట్టి అత్యంత పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. మనసున్న ముఖ్యమంత్రిని మళ్లీ సీఎం చేసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో 15 డివిజన్ ఇన్‌చార్జి వీరారెడ్డి, పి. జయచంద్రారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, వేణుగోపాల్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాన్ గుర్తుకే మన ఓటు : మేయర్ సురేష్ బాబు

ఫ్యాన్ గుర్తుకు ఓటేసి జగనన్నను మళ్లీ సీఎం చేయాలని వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్, కడప మేయర్ కె. సురేష్ బాబు కోరారు. శుక్రవారం సాయంత్రం స్థానిక 15వ డివిజన్‌లోని శివానంద పురంలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్ బాబు మాట్లాడుతూ చంద్రబాబు హామీలిచ్చి అమలు చేయరని, ఆయన మాటలను ప్రజలు నమ్మడం లేదన్నారు. నవరత్న పథకాలు కొనసాగాలంటే వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలన్నారు. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యులు యానాదయ్య, రమణ, శ్రీను, జానీ, ఈశ్వర్‌బాబు, కిరణ్, త్యాగరాజు, రామలక్ష్మణ్‌రెడ్డి, బాలస్వామిరెడ్డి, బండి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ట్యాంకుల పరిశీలన



ట్యాంకుల నిర్మాణం కొరకు స్థలాన్ని పరిశీలిస్తున్న నగరపాలక కమిషనర్ ప్రవీణ్‌చంద్

కడప కార్పొరేషన్ : కడప నగరంలో 24 గంటలూ తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని నగరపాలక కమిషనర్ జీఎస్ఎస్.ప్రవీణ్‌చంద్ ఆదేశించారు. కడపలో పలు ప్రాంతాల్లో ఉన్న ఈఎల్ఎస్ఆర్ ట్యాంకులను శుక్రవారం ఆయన పరిశీలించారు. సీఎంఆర్ పల్లి వద్ద 700కేఎల్ ట్యాంక్ ఏర్పాటు చేయుటకు స్థలం గుర్తించాలని, అక్కడి నుంచి అన్ని ప్రాంతాలకు నీరందించేలా పైపులైన్ డిజైన్ తయారు చేయాలని ఆయన సూచించారు. మామిళ్ల పల్లె లే ఔట్ నందు 900కేఎల్ ట్యాంకు ఏర్పాటు చేయుటకు స్థలాన్ని పరిశీలించి, గ్రావిటీ బేస్‌పై నీటిని అందించేలా డిజైన్ తయారు చేయాలన్నారు. చిన్నచౌక్ నందు 800కేఎల్ ట్యాంకు ఏర్పాటు చేయుటకు స్థలాలను పరిశీలించి, కాంటూర్ లెవెల్స్ ప్రకారం డిజైన్లు తయారు చేయాలన్నారు. రాయల్ కాలనీలో 800కేఎల్ ట్యాంకు కొరకు స్థల పరిశీలన చేశారు. వైఎస్సార్ లే ఔట్లో 1200 కేఎల్ ట్యాంక్ నిర్మించి, గ్రావిటీ ద్వారా ప్రజలకు నీరందించాలని, నెహ్రూపార్కు, రైల్వే స్టేషన్ రోడ్డులో ఉన్న ఈఎల్ఎస్ఆర్ ట్యాంకులను ఉపయోగంలోకి తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో నగరపాలక ఎస్ఈ రత్నాల రాజు, ఏసీపీ నాగేంద్ర, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

ఏపీజీఎల్ఐ సమస్యలు పరిష్కరించండి

యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు



ఏపీ జీఎల్ఐ సహాయ సంచాలకులకు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న యూటీఎఫ్ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : ఉద్యోగ, ఉపాధ్యాయుల వేతనాల్లో మినహాయింపు ద్వారా ఆంధ్ర ప్రదేశ్ జీవిత భీమా సంస్థకు(ఏపీజీఎల్ఐ) జమ చేస్తున్న సొమ్ము విషయంలో సమస్యలను వెంటనే పరిష్కరించాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు కోరారు. కడప జిల్లా ప్రభుత్వ భీమా సహాయ సంచాలకులు ఇదిరాదేవిని తమ కార్యాలయంలో శుక్రవారం కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. ఆయన మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులు ప్రతి నెలా జీతం నుంచి భీమా సొమ్ము మినహాయిస్తున్నప్పటికీ వాటిని జమ చేయడంలో అధికారుల నిర్లక్ష్యంతో మిస్సింగ్ క్రెడిట్స్ ఏర్పడ్డాయన్నారు. గతంలోని రికార్డులు అందుబాటులో లేక ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. భీమా కార్యాలయం వారే ట్రెజరీల ద్వారా తెప్పించుకుని మిస్సింగ్ క్రెడిట్స్‌ను జమ చేయాలని తెలిపారు. ఏపీజీఎల్ఐ బాండ్లలో నామినీ పేర్లు లేవన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ట్రెజరర్ నరసింహారావు, జిల్లా కార్యదర్శులు సివి.రమణ, ఏజాస్, పలు మండలాల నాయకులు పాల్గొన్నారు.

అప్రమత్తతతోనే అగ్ని ప్రమాదాల నివారణ



మాట్లాడుతున్న వైవీయూ ప్రిన్సిపల్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి



అవగాహనలు కల్పిస్తున్న అగ్నిమాపక శాఖ జిల్లా సహాయ అధికారి బసిరెడ్డి

వైవీయూ : అప్రమత్తతతోనే గ్యాస్ ప్రమాదాలు నివారించవచ్చని యోగి వేమన విశ్వవిద్యాలయం ప్రిన్సిపల్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి పేర్కొన్నారు. వైవీయూలో అగ్ని ప్రమాదాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ అగ్ని ప్రమాదాలపై అవగాహన పెంపొందించుకోవడం ఆవశ్యకమన్నారు. సిలిండర్ వద్ద మంటలు వస్తే దాని చుట్టూ నీళ్లతో తడిపిన గుడ్డ లేదా దుప్పటిని కప్పేస్తే మంటలు ఆగి పోతాయని జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి బసిరెడ్డి చెప్పారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎస్. వెంకట్రామిరెడ్డి, డాక్టర్ ఎస్.సునీత, డాక్టర్ కే.లలిత, డాక్టర్ వి.లాజర్, రాజశేఖర్ రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

కడప అర్బన్ : అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం హోలిస్టిక్ హాస్పిటల్, ప్రైమ్ హాస్పిటల్స్ సిబ్బందికి కడప సహాయ జిల్లా అగ్నిమాపక అధికారి, సిబ్బంది ఆధ్వర్యంలో అగ్ని ప్రమాదాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలి



ప్రచారం నిర్వహిస్తున్న మున్సిపల్ మాజీ చైర్మన్ హరీంద్రనాథ్

కడప కార్పొరేషన్ : రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ. అంజద్‌బాషను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మున్సిపల్ మాజీ చైర్మన్ హరీంద్రనాథ్ కోరారు. స్థానిక 50వ డివిజన్‌లో డివిజన్ ఇన్‌ఛార్జి రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సౌమ్యుడు, ఎవరు పిలిచినా పలికే అంజద్‌బాషను మూడోసారి ఎమ్మెల్యేగా ఎంపీగా వైఎస్.అవినాష్‌రెడ్డిని గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు తోట కృష్ణ, నారాయణ స్వామి రాయల్, దాసరి శివ, శివకేశవ, కిరణ్, సాయిపేట శ్రీను, పత్తి రాజేశ్వరి, ప్రవీణ్, ఉమామహేశ్వరి, మల్లీశ్వరి పాల్గొన్నారు.

ఆందోళనలు విడనాడి ఆత్మవిశ్వాసంతో చదవండి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ లలిత

కడప ఎడ్యుకేషన్ : విద్యార్థులు చిన్న చిన్న విషయాలకు ఆందోళన చెందకుండా ఆత్మవిశ్వాసంతో చదువులు సాగించాలని యోగివేమన విశ్వ విద్యాలయ సైకాలజీశాఖ సహ ఆచార్యులు డాక్టర్ లలిత ఉద్బోధించారు. స్థానిక బాలికల వసతి గృహ సముదాయంలో విద్యార్థులకు శుక్రవారం ప్రేరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. డాక్టర్ లలిత మాట్లాడుతూ విద్యార్థులు మానసిక ఒత్తిడికి లోనైనప్పుడు కౌన్సిలింగ్ సెంటర్, హెల్ప్‌లైన్ సెంటర్‌నుగానీ సంప్రదించాలని సూచించారు. తల్లిదండ్రుల ఆకాంక్షలు నెరవేర్చేందుకు ఉన్నతమైన ఆలోచనలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవో డాక్టర్ సునిత, మెర్సీ, విజేత, డాక్టర్ అను ప్రసన్న, డాక్టర్ సుమిత్ర విద్యార్థులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ప్రసన్న విశ్వేశ్వరుడి బ్రహ్మోత్సవాలు

కడప కల్చరల్ : కడప నగరం మోచంపేటలోని ప్రసన్న విశ్వేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 21వ తేదీ నుంచి మే 1వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు కడప గ్రూప్ ఆఫ్ టెంపుల్స్ ఈఓ ఎ.శ్రీధర్, అర్చకులు ఎ.రవిశంకర్ తెలిపారు. ఇందులో భాగంగా 21న అంకురార్పణ, 22న ధ్వజారోహణం, సూర్యప్రభ వాహనం, 23న హంస వాహనం, 24న యాలి వాహనం, 25న శేష వాహనం, 26న నంది వాహనంపై స్వామి భక్తులకు దర్శనమిస్తారని తెలిపారు.27న స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం, 28న రథోత్సవం, 29న అశ్వవాహనం, 30న ఏకాంత సేవ, మే 1న విశ్వరూప దర్శనం ఉంటాయన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అర్బన్ హెల్త్ ట్రెనింగ్ సెంటర్ వైద్యులు ఎస్.ప్రశాంత్ వర్ధన్, హెల్త్ ఎడ్యుకేటర్ ఆర్.ప్రసన్న లతలు తెలిపారు. పాత రిమ్స్ ఏరియాలోని నీటి శుద్ధి కేంద్రాన్ని శుక్రవారం ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కలుషిత నీటి కారణంగా ప్రజలు అనేక వ్యాధుల బారిన పడతారన్నారు. నీటిని కాచి చల్లార్చి తాగాలని, నివసించే ప్రాంతాల శుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు సుబ్బరాయుడు, సర్వేశ్వర్, శిక్షణ వైద్యులు నవీద్, ప్రశాంత్, సుకన్య, సౌమ్యశ్రీ పాల్గొన్నారు.

ఉరుసు ఏర్పాట్ల పరిశీలన

కమలాపురం : పట్టణంలో వెలసిన శ్రీ హజరత్ అబ్దుల్ గఫార్ షా ఖాద్రి దర్గాను కమలాపురం సీఐ రామకృష్ణారెడ్డి, ఎస్ఐ హృషికేశ్వర్‌రెడ్డి పరిశీలించారు. శుక్రవారం దర్గా చేరుకున్న వారు ఈనెల 22 నుంచి జరుగుతున్న ఉరుసు ఉత్సవ ఏర్పాట్లను పరిశీలించి దర్గా పీఠాధిపతి ఫైజుల్ గఫార్ షా ఖాద్రి, దస్తగిరి స్వామి, మౌలానా స్వామిలతో ఆరా తీశారు. ఉరుసు మహోత్సవాలకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేస్తామని సీఐ, ఎస్ఐలు తెలిపారు.

రెండో రోజూ.. నామినేషన్లు నిల్

కమలాపురం : సాధారణ ఎన్నికల నిర్వహణలో భాగంగా తొలి ఘట్టమైన నామినేషన్ల ప్రక్రియలో రెండో రోజూ శుక్రవారం సైతం ఏ పార్టీకి చెందిన అభ్యర్థి కూడా నామినేషన్లు వేయలేదు. దీంతో వరుసగా రెండో రోజు నామినేషన్లు నిల్‌గా నిలిచాయి. నామినేషన్ పత్రాలు స్వీకరించడానికి రెవెన్యూ, పోలీస్ అధికారులు అన్ని రకాల ఏర్పాట్లు సిద్ధం చేశారు.

'వాసుదాసు' ప్రాణం నిలిపిన నన్నేసాహెబ్



వావిలికొలను సుబ్బారావు

కడప కల్చరల్ : తిరుమల వేంకటేశ్వరుడికి ప్రియ భక్తుడెవరంటే అన్నమయ్య అని వెంటనే చెప్పేస్తాం. అలాగే ఒంటిమిట్ట శ్రీ కోదండరామయ్య సేవలో తరించిన అపర వాల్మీకి ఎవరంటే వాసుదాసుగా పేరొందిన వావిలికొలను సుబ్బారావు అని చెబుతారు. ఆయన ఓ మారు తీవ్ర అనారోగ్యానికి గురైతే ఓ ముస్లిం వైద్యుడు (హకీం సాహెబ్) ఆయన ప్రాణాన్ని కాపాడిన విషయం చాలామందికి తెలియదు. అపర అయోధ్య ఒంటిమిట్ట కోదండరామయ్య బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని కైఫీయత్తుల ఆధారంగా ఆ విషయాన్ని 'సాక్షి' పాఠకులకు అందిస్తున్నాం. వావిలికొలను సుబ్బారావు ఒంటిమిట్ట రామయ్య భక్తునిగా మారకముందు మద్రాసులో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేసేవారు. మంచి వయస్సులో ఉన్న సమయంలో ఆయనకు క్షయ (టీబీ) వ్యాధి సోకింది. అప్పట్లో అది ప్రాణాంతకమైన వ్యాధి అని భావించేవారు. సుబ్బారావు మద్రాసులో పెద్ద పెద్ద డాక్టర్లచే వైద్యం చేయించుకున్నా ఫలితం లేకపోయింది. జీవితంపై ఆశ వదలుకుని చివరిరోజులు తాను పుట్టిన కడప జిల్లాలో గడపాలనుకున్నారు. అప్పటికే తాను రచించిన కౌసల్యా పరిణయం అముద్రిత కావ్యాన్ని మద్రాసులోని మిత్రులకు ఇచ్చేసి కడపకు వచ్చేశాడు. జిల్లాలోని నాటి ప్రముఖ హకీం సాహెబ్ (యునాని వైద్యులు) నన్నేమియా వావిలికొలను సుబ్బారావును పిలిపించుకుని వైద్య పరీక్షలు చేశారు. ఆరు నెలల్లో తన ఆరోగ్యం బాగుపడటం గుర్తించి సుబ్బారావు ఎంతో ఆశ్చర్యపోయారు. పూర్తిగా నయమయ్యాక తిరిగి మద్రాసుకు వెళ్లి ఉద్యోగంలో చేరారు. కౌసల్యా పరిణయం కావ్యాన్ని అచ్చు వేయించారు. అనంతరం ఆయన ఒంటిమిట్ట శ్రీ కోదండరామునికి మహాభక్తుడిగా మారాడు. నన్నేసాహెబ్‌లో శ్రీరామచంద్రుడిని భావించుకున్న ఆయన ముస్లింల పట్ల ఎంతో ఆదరణ చూపేవాడు. ఆ బంధంతోనే ఒంటిమిట్ట రామయ్యను దర్శించుకునేందుకు నేటికీ ముస్లిం భక్తులు వస్తుంటారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి చేరిక



పార్టీలో చేరిన వారితో రమ్యతారెడ్డి

పెండ్లిమర్రి : ఎస్.రామాపురం గ్రామానికి చెందిన పలువురు శుక్రవారం టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి కుమార్తె డాక్టర్ రమ్యతారెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకర్ రెడ్డిల సమక్షంలో పార్టీలో చేరారు. పార్టీలో చేరిన శివారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, బాలిరెడ్డి, సుబ్బరాయుడు, వెంకటసుబ్బయ్య, వెంకటన్న, సుబ్బయ్యలకు వారు పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, మండల కన్వీనర్ చంద్రారెడ్డి, ఎంపీపీ వరలక్ష్మి, సింగల్ విండో అధ్యక్షుడు నాగేంద్రారెడ్డి, ఎంపీటీసీ సునిత పాల్గొన్నారు.

వీరపునాయునిపల్లె : మండలంలోని అనిమెల గ్రామంలో తెలుగుదేశం పార్టీకి చెందిన మాజీ డీలర్ రామయ్య అనుచరులు, పుణ్యభూమి చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు సాయినాథ శర్మ అనుచరులు శుక్రవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి సాయినాథ శర్మ, మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. సాయినాథశర్మ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఐకమత్యంతో జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకునేందుకు గట్టిగా పోరాడాలని సూచించారు.

జగనన్నతో ప్రతి కుటుంబానికి మేలు జరిగింది



వలూరు : తప్పెట్లలో ప్రచారంలో పాల్గొన్న పీ రవీంద్రనాథరెడ్డి, అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి, రాజోలు వీరారెడ్డి



చెన్నూరులో ప్రచారం నిర్వహిస్తున్న జెడ్పీటీసీ నరేన్ రామంజులురెడ్డి, తదితరులు



మెయిళ్లకాల్వలో ఎన్నికల ప్రచారం చేస్తున్న డాక్టర్ రమ్యతారెడ్డి, డాక్టర్ విజయభాస్కర్‌రెడ్డి

వల్లూరు : రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు కుల మతాలు, పార్టీలకు అతీతంగా అర్హత గల ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తూ ఆదర్శవంతమైన పాలనను సాగిస్తున్న జగనన్నను మళ్లీ ఆశీర్వదించాలని కమలాపురం ఎమ్మెల్యే పీ రవీంద్రనాథరెడ్డి, ఏపీఎస్ ఆర్‌టీసీ రాష్ట్ర చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి ఓటర్లను కోరారు. మండలంలోని తప్పెట్ల, పుల్లారెడ్డిపేట, చెరువు కిందిపల్లె గ్రామాల్లో రాష్ట్ర ప్రభుత్వ పరిశ్రమల సలహాదారులు రాజోలు వీరారెడ్డితో కలిసి శుక్రవారం వారు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. అనంతరం వారు ఇంటింటికీ తిరిగి వైఎస్ఆర్‌సీపీ కడప పార్లమెంట్ అభ్యర్థి వైఎస్ అవినాష్‌రెడ్డి, కమలాపురం అసెంబ్లీ అభ్యర్థి పీ రవీంద్రనాథరెడ్డిలను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. జగన్ మళ్లీ సీఎం అయితేనే రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు ఇంటి వద్దే అందుతాయన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు మళ్లీ అనేక అబద్దపు హామీలతో ప్రజలను మోసగించడానికి వస్తున్నాడని వారి మాటలు నమ్మొద్దన్నారు. కార్యక్రమంలో వైఎస్ఆర్ సీపీ మండల కన్వీనర్ అబ్బిరెడ్డి వీరారెడ్డి, పార్టీ నేతలు రామచంద్రారెడ్డి, రఘునాథరెడ్డి, రాజారెడ్డి, రవీంద్రారెడ్డి, బాల మైసూరారెడ్డి, బాలసుబ్బారెడ్డి, బండి రామసుబ్బారెడ్డి, ముకుందారెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, రేనాటి సుబ్బిరెడ్డి, సుబ్బారెడ్డి, పుల్లారెడ్డి, ఓబుల్ రెడ్డి, నారాయణరెడ్డి, బాబురెడ్డి, బత్తల శంకర్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

చెన్నూరులో..

చెన్నూరు : స్థానిక మైనార్టీ కాలనీలోని 4, 5 వార్డులలో చింతకొమ్మదిన్నె జెడ్పీటీసీ నరేన్ రామాంజులురెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జగనన్న ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగివుంటేనే మళ్ళీ వైస్సార్సీపీకి పట్టం కట్టాలని ఆయన ప్రజలను కోరారు. ఎమ్మెల్యే పోచంరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి, ఎంపీ అవినాష్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు అన్వర్‌బాషా, మునీర్ అహ్మద్, జుమన్, నూర్, సాదిక్ అలీ, కరీం, ఫషీర్, అబ్దుల్‌రబ్, వారిష్, హస్రత్, జిల్లా ఉపాధ్యక్షుడు గుమ్మా రాజేంద్రప్రసాద్‌రెడ్డి, ఎంపీపీ చీర్ల సురేష్ యాదవ్, సీఎస్ భాస్కర్‌రెడ్డి, ఆర్‌వీఎస్ఆర్, ముదిరెడ్డి సుబ్బారెడ్డి, గణేష్‌రెడ్డి, ఎం.రవిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్లు నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస రాజు, గుమ్మల మధుసూదన్‌రెడ్డి, మెడికల్ రవి ఎంపీటీసీలు, సర్పంచులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పెండ్లిమర్రిలో..

పెండ్లిమర్రి : మొయిళ్లకాల్వ గ్రామ పంచాయతీలోని ఎస్.రామాపురం, గంగులయ్యగారిపల్లె, కాండ్లోపల్లె, అయ్యవారుపల్లె, రాళ్లపల్లె, మొయిళ్లకాల్వ, మొయిళ్లకాల్వ దళితవాడ గ్రామాల్లో ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి కుమార్తె,అల్లుడు డాక్టర్ రమ్యతారెడ్డి, విజయభాస్కర్‌రెడ్డిలు ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించారు. తిరిగి సంక్షేమ పథకాలు కొనసాగాలంటే త్వరలోజరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎంపీ అభ్యర్థి వైఎస్ అవినాష్‌రెడ్డిని, ఎమ్మెల్యే అభ్యర్థి పి.రవీంద్రనాథ్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, మండల కన్వీనర్ చంద్రారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకర్‌రెడ్డి, ఎంపీపీ వరలక్ష్మి, సింగల్‌విండో అధ్యక్షుడు నాగేంద్రారెడ్డి, జెసీఎస్ కన్వీనర్ అమర్‌నాథ్‌రెడ్డి, ఎంపీటీసీ సునిత, సర్పంచ్ బాబాబి, వైఎస్సార్‌సీపీ నాయకులు హుస్సేన్, వెంకటసుబ్బారెడ్డి, ఖాదర్, బ్రహ్మంరెడ్డి, చెన్నారెడ్డి, గంగన్న, ప్రసాద్, పాల్గొన్నారు.

సీఎంగా జగనన్నే కావాలని ప్రజలు కోరుకుంటున్నారు

వల్లూరు : రాష్ట్రంలో మునుపెన్నడూ లేని విధంగా సంక్షేమ పాలనను అందించిన జగనన్నే మళ్లీ సీఎం కావాలని ప్రజలంతా గట్టిగా కోరుకుంటున్నారని కమలాపురం ఎమ్మెల్యే పీ రవీంద్రనాథరెడ్డి తెలిపారు. వల్లూరు మండలంలోని తప్పెట్ల గ్రామ పంచాయతీలో శుక్రవారం జరిగిన ఎన్నికల ప్రచారంలో ఏపీఎస్ ఆర్టీసీ రాష్ట్ర చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి, రాష్ట్ర పరిశ్రమల సలహాదారులు రాజోలు వీరారెడ్డితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ప్రతి కుటుంబానికి రూ.50 వేల నుంచి రూ.15 లక్షల వరకు ప్రయోజనం కలిగిందన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలు మా దృష్టికి తీసుకు వచ్చిన సమస్యలను వీలైనంత వరకు పరిష్కరించడానికి కృషి చేశామన్నారు. గత ప్రభుత్వాల పాలనలో ఎలాంటి అభివృద్ధికి నోచుకోని నియోజకవర్గాన్ని జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో రూ.6,800 కోట్లతో అన్ని విధాలుగా అభివృద్ధి చేశామన్నారు. మహానేత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి గాలేరు నగరి సుజల స్రవంతి ద్వారా చిత్తూరు, కడప, కర్నూలు జిల్లాల్లో 2 లక్షల 75 వేల ఎకరాల భూమికి సాగు నీరందించడానికి చర్యలు చేపట్టారన్నారు. అందులో కేవలం కమలాపురం నియోజకవర్గంలోనే సుమారు 80 వేల ఎకరాల భూమికి సాగు నీరందనుందని వివరించారు. కరోనా మహమ్మారి వలన రెండు సంవత్సరాల పాటు ఆర్థిక పరిస్థితులు సహకరించక పోవడంతో మిగిలి వున్న పనులు పూర్తి కాలేదని, వచ్చే 5 ఏళ్లలో వాటిని పూర్తి చేసి సాగు నీరు అందిస్తామన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న రవీంద్రనాథరెడ్డి, అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి, రాజోలు వీరారెడ్డి

ఏపీఎస్ఆర్‌టీసీ చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ దేశంలో ఏ రాష్టంలో లేని విధంగా జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలకు సంక్షేమ పథకాలను అందించారన్నారు. టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలు కలిసి వచ్చినా ప్రజలంతా జగన్‌మోహన్‌రెడ్డి వైపే వున్నారన్నారు. రాష్ట్ర పరిశ్రమల సలహాదారులు రాజోలు వీరారెడ్డి మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం హయాంలో ఇప్పటికే జిల్లాలో 25 వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరిగిందన్నారు. కొప్పర్తి ఇండస్ట్రియల్ పార్కులో ఈ ప్రభుత్వం వచ్చాక పరిశ్రమల స్థాపన వేగవంతం అయిందన్నారు. కార్యక్రమలో మండల కన్వీనర్ అబ్బిరెడ్డి వీరారెడ్డి, పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు.